మార్వాడీ గో బ్యాక్ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు

మోతీనగర్: మార్వాడీ కల్చర్ గో బ్యాక్ అంటూ ఈ నెల 22న ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ ఇచ్చిన బంద్‌కు బోరబండ, మోతీనగర్, అల్లాపూర్ తెలంగాణ జేఏసీలు సంయుక్తంగా మద్దతు తెలుపుతున్నామని జేఏసీ చైర్మన్ మహ్మద్ నయిముద్దీన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో మార్వాడీ, గుజరాతి, రాజస్థానీ వ్యాపారస్తుల సిండికెట్ వల్ల స్థానిక ప్రజలతో పాటు వ్యాపారస్తులు, చేతి వృత్తి కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మార్వాడీ కల్చర్ వల్ల తెలంగాణ సంస్కృతి దెబ్బతిని వారు అమ్మే నకిలీ సామాన్లు వల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ బంద్‌కు పూర్తి మద్దతు ఉంటుందన్నారు. బంద్ శాంతియుతంగా కొనసాగించటంతో పాటు అన్ని సంఘాల వాళ్లు పాల్గొంటారని తెలిపారు.

కేబుల్ వైర్ల తొలగింపు



మోతీనగర్: ప్రమాదాలకు కారణమవుతున్న విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న కేబుల్ వైర్లను బుధవారం అల్లాపూర్ డివిజన్ తులసినగర్‌లో తొలగించారు. ఈ సందర్భంగా ఏఈ రాకేష్ గౌడ్ మాట్లాడుతూ.. తులసినగర్, లక్ష్మీ నగర్, వివేకానందనగర్‌లలో ఉన్న విద్యుత్ స్తంభాలకు ప్రైవేట్ సంస్థలు ఏర్పాటు చేసిన పలు రకాల కేబుళ్లను విద్యుత్ సిబ్బంది తొలగించారన్నారు. అల్లాపూర్ సెక్షన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో స్తంభాలకు ప్రమాదకరంగా వేలాడుతున్న కేబుల్స్ అన్నింటిని క్రమ పద్ధతిలో త్వరలో తొలగించనున్నామని తెలిపారు.

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన నేతలు



ఆల్విన్‌కాలనీ: బహుజన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సందర్భంగా బుధవారం టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ని నీల వంశీగౌడ్, యూత్ కాంగ్రెస్ సభ్యులు కలిశారు. ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

బస్సు సౌకర్యం కల్పించాలని సంతకాల సేకరణ



బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని దిల్‌కుష్‌నగర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కాలనీలో సంతకాల సేకరణ నిర్వహించారు. గతంలో కాలనీకి బస్సులు నడిపేవారని, సీసీ రోడ్ల నిర్మాణం పనులు జరిగే సమయంలో బస్సులు రావటం ఆగాయని తెలిపారు. సుమారు సంవత్సరం నుంచి బస్సులు కాలనీకి రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఏ. విజయ, సువర్ణ, భాగ్య, మాధవీలత, మబ్బాస్, రమాదేవి, షమీం, అజ్గరీ, మున్వర్, పాయాజ్, ఫరూకీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

చందానగర్: రోడ్డు ప్రమాదంలో ఒకరు.. చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం .. గోపన్‌పల్లికి చెందిన ఎం.తరుణ్ (25) ఆర్సీపురంలో ఉంటూ ర్యాపిడో డ్రైవర్‌గా చేస్తున్నాడు. బుధవారం ఉదయం 5 గంటలకు నల్లగండ్ల ఫ్లైఓవర్ వద్ద చెత్త ఆటో పార్క్ చేసి ఉంది. స్కూటీ పై వస్తున్న తరుణ్ చెత్త ఆటోను ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న చందానగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. తరుణ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

మరో ఘటనలో...

ఒడిశా నుంచి వచ్చి ఈసీఐఎల్‌లో ఉంటున్న రాకేష్ జైన్ (39) ప్లంబర్. ఈ నెల 16వ తేదీ పల్సర్ బైక్‌పై చందానగర్ పీజేఆర్ ఎన్‌క్లేవ్ నుంచి అపర్ణ కన్‌స్ట్రక్షన్‌కు వెళ్తుండగా రోడ్డు పక్కన ఉన్న మ్యాన్‌హోల్ వద్ద బైక్‌పై నుంచి జారి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలవడంతో రాకేష్‌ను గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలి

- వినాయక చవితి ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: వినాయక చవితి మొదలుకొని రాబోయే పండుగలను ఘనంగా నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేపట్టాలని, అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి పండుగలు, నిమజ్జన ఏర్పాట్లపై చర్చించారు. ఈ నెల 27 నుంచి మొదలయ్యే వినాయక చవితి ఉత్సవాలకు నియోజకవర్గం పరిధిలో అన్ని డివిజన్‌లలో ప్రత్యేక ఏర్పాటు చేపట్టాలని, నిమజ్జనం నిర్వహించే చెరువుల వద్ద ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో ఏ చిన్న ఇబ్బందులు లేకుండా అన్ని చెరువులు, కుంటల వద్ద ప్రత్యేక సిబ్బంది నియామకం, భారీ క్రేన్‌ల ఏర్పాట్లు, నిత్యం అన్ని ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకోవటం ద్వారా పండుగలను ఘనంగా జరుపుకోవటం జరిగిందన్నారు. అదే విధంగా వినాయక చవితి తరువాత వచ్చే బతుకమ్మ పండుగను, దసరా నవరాత్రి ఉత్సవాలను కూడా దృష్టిలో ఉంచుకొని చేపట్టాల్సిన ఏర్పాట్లపై ముందస్తు అనుమతులు తీసుకోవడం, పనులు నిర్వహించడం వంటివి వెంటనే చేపట్టాలని సూచించారు. నియోజకవర్గంలో వర్షాల మూలంగా ఇబ్బందులు లేకుండా వాటర్ లాగింగ్ పాయింట్లపై అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో స్థానిక ప్రజలను అప్రమత్తం చేస్తూ అందరి సమన్వయంతో సమస్యలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ చిన్నారెడ్డి, ఈఈ, అధికారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన శ్రీశ్రీనగర్ నూతన కమిటీ సభ్యులు

ఎమ్మెల్యేను కలిసిన నూతన కమిటీ

కూకట్‌పల్లి: శ్రీశ్రీనగర్ కాలనీ నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన దుర్గేష్ ముదిరాజ్, జనరల్ సెక్రటరీ కిట్టు, సభ్యులు బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిశారు. నూతన కమిటీని అభినందించారు. కాలనీలో ఉన్నటువంటి సమస్యలను గుర్తించి తన దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

కాలనీల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కూకట్‌పల్లి: సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హనుమాన్‌నగర్, ప్రగతినగర్, దీనబంధు కాలనీ, హైదర్‌నగర్ డివిజన్‌లలోని హైదర్‌నగర్ బస్తీ రాఘవేంద్ర కాలనీ బస్తీ స్థానిక సమస్యను పరిష్కరించాలని బుధవారం సర్కిల్ ఉప కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హనుమాన్‌నగర్, ప్రగతినగర్, దీనబంధు కాలనీలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలని, మ్యాన్‌హోళ్లకు మూతలు ఏర్పాటు చేయాలన్నారు. మంచినీరు కలుషితం కాకుండా చూడాలని, ప్రగతి నగర్ బస్తీలోని ప్రభుత్వ స్కూల్ బిల్డింగ్‌ను నూతనంగా నిర్మించాలని కోరారు. అనంతరం డీసీ మాట్లాడుతూ.. దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

వీడని బాలిక హత్య మిస్టరీ

ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీసీపీ

మూసాపేట: కూకట్‌పల్లి, దయార్‌గూడలో బాలిక సహస్రిని (11) హత్య మిస్టరీ ఇంకా వీడలేదు. పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఓటీ, సీసీఎస్, లా అండ్ ఆర్డర్ పోలీసులు వివిధ బృందాలుగా ఏర్పడి క్షుణ్ణంగా నిందితుడి కోసం జల్లెడ పడుతున్నారు. బుధవారం ఎస్ఓటీ అడిషనల్ డీసీపీ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. భవనంలో అద్దెకున్న వారిని, స్థానికులను, బంధువులను, పలువురిని ప్రశ్నించారు. ఇప్పటి వరకు హత్య మిస్టరీపై పోలీసులు ఎలాంటి స్పష్టత ఇవ్వటం లేదు. దర్యాప్తు వేగవంతంగా జరుగుతుందని, దర్యాప్తు అనంతరం వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

ఆరుగురు మహిళల అరెస్టు

మూసాపేట: కేపీహెచ్‌బీ కాలనీలో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఆరుగురు మహిళలను కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి నలుగురిని రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. భాగ్యనగర్ కాలనీ, అల్లూరి ట్రేడ్ సెంటర్ సమీపంలో రోడ్డుపై నిలబడి విటులను ఆకర్షిస్తూ, షాపింగ్ వచ్చిన వారితో పలువురు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. దీంతో పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఇద్దరిని కూకట్‌పల్లి తహసీల్దార్ ఎదుట హాజరు పరిచి బైండోవర్ చేశారు. మిగిలిన నలుగురిని జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.

‘ఎస్కీ’లో వివిధ రాష్ట్రాలు, విదేశీ ప్రతినిధుల సందడి

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ) క్యాంపస్ వివిధ రాష్ట్రాల, విదేశీ ప్రతినిధులతో బుధవారం సందడిగా మారింది. ఈ సందర్భంగా అందరూ ఫొటోలు తీసుకున్నారు. ఎస్కీలో పలు శిక్షణా కార్యక్రమాలు జరుగుతుండడంతో దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, విదేశీ డెలిగేట్లు వచ్చారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



మూసాపేటలో నివాళులర్పిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ తదితరులు

నివాళులర్పించిన నేతలు

ఆల్విన్‌కాలనీ: మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆయన కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో సాంకేతికతకు నాంది పలికింది రాజీవ్ గాంధీ అని అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారతదేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తు చేశారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, రాజ్యలక్ష్మి, సౌందర్య, అరుణ, మంజుల, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మారెళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో...

ఆల్విన్‌కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతిని నిర్వహించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు తదితరులు

మూసాపేట: టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్, కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, మూసాపేట ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో పి. నాగిరెడ్డి, ఎల్లేష్ యాదవ్, జి. వెంకటేశ్వరరావు, ప్రకాష్ ముదిరాజ్, సప్పిడి భాస్కర్, నర్సింహ యాదవ్, తూము సంతోష్, మల్లేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీలో ఎకరా భూమి రూ. 70 కోట్లు

సాక్షి, సిటీ బ్యూరో: కూకట్ పల్లి హౌజింగ్ బోర్డు కాలనీలో ఒక ఎకరం భూమి రూ.70 కోట్లకు పలికింది. బుధవారం హౌజింగ్ బోర్డు ఈ – వేలం నిర్వహించగా.. భూములను గోద్రేజ్ సంస్థ దక్కించుకుంది. కూకట్‌పల్లి హౌజింగ్ బోర్డు కాలనీలో 7.8 ఎకరాల విస్తీర్ణంలోని భూమిని కొనుగోలు చేయడానికి గోద్రేజ్ ప్రాపర్టీస్‌తో పాటు అరబిందో రియాల్టీ, ప్రెస్టీజ్ ఎస్టేట్స్, అశోక బిల్డర్ సంస్థలు పోటీ పడ్డాయి. సుమారు మూడున్నర గంటల పాటు నిర్వహించిన ఈ వేలం పాటలో ఎకరాకు రూ.40 కోట్లు కనీస ధరగా నిర్ణయించగా.. బిడ్డర్లు 46 సార్లు ధరను పెంచుతూ వేలంలో పాల్గొన్నారు. చివరకు గోద్రేజ్ సంస్థ అత్యధికంగా ఎకరం భూమి ధర రూ.70 కోట్లకు కోట్ చేసి భూములను కొనుగోలు చేసినట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వీపీ గౌతం తెలిపారు. ఈ భూముల విక్రయం ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.547 కోట్ల మేర ఆదాయం సమకూరినట్లు ఆయన పేర్కొన్నారు.

రాజీవ్ స్వగృహ అసంపూర్తి టవర్ల కేటాయింపు

రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కు చెందిన టౌన్ షిప్‌లలో అసంపూర్తిగా ఉన్న బహుళ అంతస్తుల భవనాల (3 టవర్లు) విక్రయం ద్వారా ప్రభుత్వానికి రూ.70.11 కోట్ల ఆదాయం వచ్చింది. నగర శివార్లలోని పోచారం టౌన్ షిప్‌లో మొత్తం 194 ఫ్లాట్లు ఉన్న రెండు టవర్లను (112 ఫ్లాట్లు, 72 ఫ్లాట్లు), గాజుల రామారంలోని 112 ఫ్లాట్‌లు ఉన్న ఒక టవర్‌ను బుధవారం నాడు లాటరీ ద్వారా కేటాయించారు. పోచారంలోని నిర్మాణాలకు చదరపు అడుగుకు రూ.1650 ధరను, గాజులరామారంలోని వాటికి రూ.1995లను నిర్ణయించారు. ఇందులో భాగంగా పోచారంలో 72 ఫ్లాట్లతో అసంపూర్తిగా ఉన్న టవర్‌ను ఎన్‌టీపీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు రూ.13.78 కోట్లకు, 122 ఫ్లాట్లు ఉన్న మరో టవర్‌ను గాయత్రీ ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ ట్రస్టు వారికి రూ.30 కోట్ల మొత్తానికి లాటరీ ద్వారా కేటాయించారు. అలాగే గాజులరామారంలోని 112 ఫ్లాట్లతో అసంపూర్తిగా ఉన్న టవర్‌ను ఎఫ్‌సీఐ ఎంప్లాయిస్ అసోసియేషన్ వారికి రూ.26.33 కోట్లకు కేటాయించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నిజాంపేట్: సీపీఎస్ రద్దుకై సెప్టెంబర్ 1న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ బాచుపల్లి మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్శగళ్ళ నర్సింలు, మాలి ప్రమోద్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఈఎఫ్ఏ ఉదయ్‌కుమార్

మోతీనగర్: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఎలాంటి వ్యాధులు దరిచేరవని ఈఎఫ్ఏ ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం అల్లాపూర్ డివిజన్ రాణా ప్రతాప్‌నగర్‌లోని గీతాంజలి స్కూల్‌లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మూసాపేట సర్కిల్ ఎంటమాలజీ సంయుక్త ఆధ్వర్యంలో దోమల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారానికి ఒకసారి ఇంటి ఆవరణలో నిల్వ ఉన్న నీటిని తొలగించుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు దరిచేరవని తెలిపారు. అదే విధంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటంతో పాటు చెత్తా చెదారం లేకుండా చూసుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈ సోని, ఎస్ఎఫ్‌డబ్ల్యూ సిబ్బంది పి. శ్రీను, పి. కృష్ణ, సోమరాజు, ఎం. రాజు, కాలనీ అధ్యక్షుడు మాధవాచారి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంక్షేమ సంఘం వాసులు

మోతీనగర్: భూగర్భ డ్రైనేజి లైన్ శిథిలావస్థలో ఉందని, దీంతో రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తుందని హరినగర్ సంక్షేమ సంఘం సభ్యులు కార్పొరేటర్ సబిహాబేగంకు వివరించారు. బుధవారం వార్డు కార్యాలయంలో ఆమెను కలిసి సమస్యను వివరించారు. ఉదయం పాఠశాలలకు విద్యార్థులు వెళ్లే సమయంలో ఎక్కువగా డ్రైనేజీ నీరు రోడ్డుపై పారుతోందని, సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. జలమండలి జనరల్ మేనేజర్‌తో సంప్రదించి త్వరగా సమస్య పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో హరినగర్ సంక్షేమ సంఘం సభ్యులు నర్సింహ, యాదగిరి, రత్నం, విజయ్, ఆకాష్, నర్సింహ, గణేష్, శ్రీను, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని హస్మత్‌పేట్, ఛత్రిగడ్డలోని సాంబశివ దేవాలయ నిర్మాణ పనులను కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ బుధవారం పరిశీలించారు. అనంతరం ప్రత్యేక సాంబ శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. ఆలయ నిర్మాణం అనంతరం దేవాలయం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేయాలని కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్‌ను సభ్యులు కోరారు. తన సొంత నిధులతో ఆలయ ప్రహరీ నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామని కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మట్టి శ్రీనివాస్, దామోదర్, చందు యాదవ్, మోహన్, రాకేష్, మధు, నాగేందర్, నరేష్, గోపాల్, శ్రీనివాస్, అన్వన్‌సింగ్, సంగమేశ్వర్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ఇసుక తొలగింపు




మోతీనగర్: వర్షాలకు అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ చౌరస్తాలో వర్షం నీరు ప్రవహించడంతో ఇసుక పేరుకుపోయింది. దీంతో వాహనదారులు, పాదచారులు నడవడానికి లేకుండా తయారైంది. అంతే కాకుండా వాహనాలు జారి పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. హైటెక్ సిటీకి కూతవేటు దూరంలో ఉన్న పర్వత్‌నగర్ చౌరస్తా, కైత్లాపూర్ బ్రిడ్జి నుంచి వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. రోడ్డుపై ఇంత ఇసుక పేరుకుపోయినా ఏ అధికారి ఇటు వైపు చూడలేదు. ప్రమాద తీవ్రతను గుర్తించిన జనప్రియ నగర్‌కు చెందిన పాండునాయక్ బుధవారం తన జేసీబీతో పేరుకుపోయిన ఇసుకను తొలగించారు. స్థానికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

గురుకులంలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

రాయదుర్గం: గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల/పాఠశాలలో రాష్ట్ర విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. బుధవారం విజిలెన్స్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అదనపు ఎస్పీ సూర్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ వై రామకృష్ణతో కూడిన బృందం తనిఖీ చేశారు. విద్యార్థినులకు కల్పించిన సౌకర్యాలను, పరిశీలించారు. అనంతరం బియ్యం, సరుకులు, ఆకుకూరలు, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడారు. వారితో కలిసి భోజనం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ కల్పనతో సమావేశమై వివరాలడిగి తెలుసుకున్నారు.

ట్రిపుల్‌ఐటీ-హైదరాబాద్ డైరెక్టర్‌గా ప్రొ.సందీప్‌శుక్లా



రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ నూతన డైరెక్టర్‌గా ప్రొఫెసర్ సందీప్ శుక్లా బుధవారం బాధ్యతలు చేపట్టారు. గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డైరెక్టర్ పీజేనారాయణన్ బాధ్యతలను ఆయనకు అప్పగించారు. ఈ సందర్భంగా నూతన డైరెక్టర్ సందీప్‌శుక్లా మాట్లాడుతూ అన్ని రంగాలలో విద్యా సంస్థ ఖ్యాతిని మరింత పెంచడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.కాగా ప్రొఫెసర్ సందీప్ శుక్లాకు సైబర్ సెక్యూరిటీలో అంతర్జాతీయ గుర్తింపు ఉంది.

లౌకిక శక్తులు ఏకమవ్వాలి

- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా
- ఘనంగా రాష్ట్ర మహాసభలు ప్రారంభం
- అరుణపతాకాలతో ఎరుపెక్కిన గాజులరామారం



సాక్షి,మేడ్చల్ జిల్లా/సుభాష్‌నగర్: కేంద్రంలోని బీజేపీని గద్దె దించేందుకు లౌకిక శక్తులు ఏకమవ్వాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలు బుధవారం గాజులరామారంలోని మహారాజా ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. అంతకుముందు కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అరుణ పతాకాలతో గాజులరామారం ఎరుపుమయంగా మారింది. బీజేపీకి వ్యతిరేకంగా కార్యకర్తలు నినాదాలు చేశారు. మహాసభల్లో రాష్ట్రంలోని 33 జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తూ.. 743 మంది పార్టీ ప్రతినిధులు హాజరయ్యారు. ప్రారంభ సభకు సీపీఐ శ్రేణులు ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలు ధరించి పెద్దఎత్తున హాజరయ్యారు. సభకు ముఖ్య అతిథిగా రాజాతో పాటు జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొన్నారు. అంతకు ముందు అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీని తెలంగాణలో మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. మతోన్మాద శక్తుల కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎం.డీ.యూసుఫ్ అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పాశ్య పద్మ, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి, కె.శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస రావు, సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హేమంతరావు, శంకర్, ఎం.బాల నరసింహ, బోస్, ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు డి.జి.సాయిల్, ప్రధాన కార్యదర్శి ఇ.ఉమా మహేశ్ పాల్గొన్నారు.

కమ్యూనిస్టు పార్టీలను ఏకం చేయాలి: కందిమళ్ల ప్రతాపరెడ్డి

వీర తెలంగాణ గడ్డపై బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకునే శక్తి కేవలం వామపక్ష పార్టీలకే ఉందని, ఇందుకు అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఏకం కావాలని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు, సీపీఐ సీనియర్ నేత కందిమళ్ల ప్రతాపరెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ వందేళ్ల ప్రస్థానంలో చేసిన పోరాటాలు, త్యాగాలు సాధించిన విజయాలను మననం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని గాజులరామారం (కామ్రేడ్ పాట్లూరి నాగేశ్వరరావు నగర్)లోని మహారాజాగార్డెన్('కామ్రేడ్ ఎస్.బాలమల్లేశ్ హాల్)లోని సీపీఐ రాష్ట్ర 4వ మహాసభల్లో ఆయన మాట్లాడుతూ.. మాతృదేశం కోసం సీపీఐ నాయకులు ప్రాణాలను అర్పించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 1942 వరకు భారత కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉన్నా.. రైతులు, కూలీలు, విద్యార్థులు, యువకులను సంఘటితం చేసి స్వాతంత్ర్య పోరాటంలో కదిలించిందన్నారు. నిరంకుశ నిజాంకు వ్యతిరేకంగా మట్టి మనుషులతో బంధూకులు పట్టించి సాయుధ సమరాన్ని నడిపిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. కమ్యూనిస్టు పార్టీలను ఏకం చేసేందుకు కీలకపాత్ర పోషించాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజాను ఆయన కోరారు. రాజకీయాలు వ్యాపారంగా మారాయని, కమ్యూనిస్టుల పాత్ర ఏమిటనేది మహాసభలో ఆత్మపరిశోధన చేసుకోవాలని సూచించారు. కుల్లుతున్న వ్యవస్థను కూకటి వేళ్లతో తొలగించాలని సినీనటులు మాదాల రవి అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాంస్కృతిక విప్లవం రావాల్సిన అవసరం ఉందన్నారు. ఎర్రమల్లెలు లాంటి సినిమాలు తీసిన మాదాల రంగారావు కూడా కమ్యూనిస్టు పార్టీ తయారు చేసిన ఆయుధమేనన్నారు.

రక్తంతో ఎరుపెక్కిందే ఎర్ర జెండా : ఏటుకూరి ప్రసాద్

అమర వీరుల త్యాగం, రక్తంతో ఎరుపెక్కిన జెండా ఎర్రజెండా అని, నిజాంకు వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటంలో ఎందరో అమరులైన వారి వారసత్వం బాట ఎర్రబాట అని ఏటుకూరి ప్రసాద్ అన్నారు. గతంలో కమ్యూనిస్టులు రక్తార్పణతో ఏ ఆశయాలు, ఆదర్శాలతో ముందుకెళ్లారో.. ఆ ఆశయాల స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఫాసిజం ఎన్నో రకాల ముసుగు ధరించి చిన్నల నుంచి పెద్దల వరకు అనేక రూపాల్లో బయటపడటం ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతమన్నారు. ఈ పరిస్థితులు ఎదుర్కొనే శక్తి కేవలం వామపక్షాలకు మాత్రమే ఉందన్నారు.